క్లుప్తంగా

నేత్రదానం



హేమలత(ఫైల్)

విడవలూరు: విడవలూరులోని కాపువీధికి చెందిన బెజవాడ హేమలత(68) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె కోరిక మేరకు నేత్రాలను కుటుంబ సభ్యుల దానం చేశారు. మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులరెడ్డి సహకారంతో నెల్లూరు మోడరన్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ నాగేశ్వరరావు నేత్రాలను సేకరించారు.

29న జాబ్ మేళా

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళాను ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్‌బీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నామని ఆర్ఐఓ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్‌బీ నాన్ మ్యాథమేటిక్స్ (సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఒకేషనల్) విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరుకావొచ్చని చెప్పారు. ఇంటర్‌లో 75 శాతం ఉత్తీర్ణత ఉండాలని వివరించారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి ఆఫర్ లెటర్‌ను అందజేయనున్నారని పేర్కొన్నారు. మొదటి మూడు నెలలు మదురైలో క్లాస్ రూమ్ శిక్షణ ఉంటుందని, ఆ సమయంలో స్టయిఫండ్‌గా రూ.పది వేలను అందజేయనున్నారని వెల్లడించారు. ఉద్యోగం పొందాక ఏడాదికి రూ.1.7 లక్షల వేతనాన్ని ఇవ్వనున్నారని, వివరాలకు 77803 23850 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా రాహుల్

నెల్లూరు (టౌన్): ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా రాహుల్ నియమితులయ్యారు. ఈ మేరకు తిరుపతిలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమశేఖర్ ప్రకటించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు.

నేత్ర శస్త్రచికిత్స పథకానికి విరాళం

నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ హాస్పిటల్లో నిర్వహిస్తున్న ఉచిత నేత్ర శస్త్రచికిత్స పథకానికి రూ.50 వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. నగరానికి చెందిన పొన్నలూరు సీతారామిరెడ్డి, జ్యోతిరెడ్డి తమ కుమారుడు వినయ్‌రాఘవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ మొత్తాన్ని ఇచ్చారు. ఈ మొత్తంతో 25 మంది పేదలకు ఆపరేషన్లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మేనేజర్ గురుప్రసాద్ మాట్లాడారు. ఆపరేషన్‌కు రూ.రెండు వేల ఖర్చవుతుందని, దాతలు సాయం చేయాలని కోరారు. అనంతరం శస్త్రచికిత్స చేయించుకున్న వారికి మందులు, కళ్లద్దాలను అందజేశారు. డాక్టర్ శ్రీలక్ష్మి, ఆస్పత్రి డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


వేడుకగా కుంభాభిషేక మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో గల మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో పుష్కర మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. శ్రీదేవీ, భూదేవీ సమేత గురువాయూర్ మహావిష్ణు వారి మూలమూర్తులకు శిఖర కలశ ధ్వజస్తంభ విశేషారాధన, మహాప్రోక్షణ, శాత్తుమొర్రై తదితరాలను విశేషంగా బుధవారం జరిపారు. ఊంజల్‌సేవను రాత్రి నిర్వహించారు. తలమంచి వెంకటేశ్వరరావు, సునీత, సతీష్, రాధిక, డాక్టర్ నరసింహారెడ్డి, విజయ, మేడికొండ పద్మమోహన్, స్నేహ దంపతులు, ముంగమూరు కృష్ణచైతన్య, అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై కోటేశ్వరస్వామి

సంగం : మండలంలోని దువ్వూరు గ్రామంలో కొలువైన గంగా పార్వతి సమేత కోటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం శేష వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు.

పాఠశాలల్లో అక్షరాభ్యాసం



ఆత్మకూరురూరల్ : మండలంలోని కనుపూరుపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం సరస్వతి పూజ నిర్వహించారు. పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. 1 నుంచి 5 వ తరగతి వరకు విద్యార్థులకు పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ తదితర విద్యాసామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పట్నం అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై అజయ్‌కుమార్



బుచ్చిరెడ్డిపాళెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్, పోలీసు సిబ్బంది

మనుబోలు: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని మనుబోలు ఎస్సై అజయ్‌కుమార్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. తొలుత విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. సమాజంలో గౌరవాన్ని కోల్పోతారన్నారు. కుటుంబం తీవ్రంగా నష్టపోతుందన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా చదువుపైనే ఏకాగ్రత చూపాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తుంటే తమకు సమాచారం అందజేయాలని కోరారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, అధ్యాపకులు సుధాకర్, శ్రీనివాసులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని బుచ్చిరెడ్డిపాళెం ఎక్సైజ్ సీఐ యశోద సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని డీఎల్ఎన్నార్ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు నేర్చుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటుపడితే భవిష్యత్ అంధకారంగా మారుతుందని హెచ్చరించారు. అనంతరం పట్టణంలో మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ హైమారావు, సెబ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం



ఇందుకూరుపేట: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కే వాణి

ఇందుకూరుపేట: మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారమవుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని డేవిస్‌పేటలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. వాటికి యువత దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఉచిత న్యాయ సాయం, బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీ రమేష్‌కుమార్, ఎంపీడీఓ సాయిలక్ష్మి, సర్పంచ్ ప్రభావతమ్మ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

30న చెముడుగుంటలో ఉచిత వైద్య శిబిరం

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న నెల్లూరుకు చెందిన ఎనెల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరంలో ప్రముఖ వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు ఎనెల్ ఆస్పత్రి నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెముడుగుంట పరిసర ప్రాంతాల ప్రజలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముత్తుకూరు: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. పైనాపురానికి చెందిన పర్వతాల నాగరాజు (40) వివాహితుడు. కొంతకాలం క్రితం భార్య, పిల్లలు విడిపోయి నెల్లూరులో స్థిరపడ్డారు. అప్పట్నుంచి కూలీ పనులు చేసుకుంటూ నాగరాజు తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. ఇటీవల తల్లిదండ్రులు చనిపోవడంతో ఒంటరి వాడయ్యాడు. ఈ క్రమంలో మనస్థాపంతో మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కృష్ణపట్నం పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు: మండలంలోని గౌతమ్‌నగర్‌లో కొడవలూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులు–వాటి నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం విఠలమ్మ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలుషిత ఆహారం, నీటితో డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. వర్షాకాలంలో తాజా ఆహార పదార్థాలు, పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తద్వారా డయేయాతోపాటు మలేరియా, తదితర వ్యాధులను దూరం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త అనిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6,7 తరగతుల్లో మిగిలిన సీట్లకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ జయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు గురువారంలోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 28న పాఠశాలలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 97045 50103, 91607 95301 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ముత్తుకూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లుగా ప్రిన్సిపల్ సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ, ఓసీ, బీసీ కేటగిరీలో మిగిలి ఉన్న ఐదు సీట్లను భర్తీ చేసే నిమిత్తం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు గురువారం ఉదయం 9 నుంచి 11 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. శుక్రవారం 11 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

తోటపల్లిగూడూరు:మండలంలోని కోడూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 6,7 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 28న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో–1(ఎస్టీ), 7వ తరగతిలో–2(ఎస్సీ) సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం ఉదయం 10గంటలకు ప్రవేశ పరీక్షలు ఉంటుందన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆయా సీట్లను కేటాయిస్తామన్నారు.

విద్యార్థులు సోదరభావంతో మెలగాలి



విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతున్న వక్తలు

కొడవలూరు: సీనియర్, జూనియర్ అన్న వ్యత్యాసం లేకుండా విద్యార్థులు సోదరభావంతో మెలగాలని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పీ గుణశేఖర్ సూచించారు. నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సోదరభావంతో మెలగడం ద్వారా ర్యాగింగ్ వంటి వికృత క్రీడలకు దూరంగా ఉండవచ్చని సూచించారు. అనంతరం ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య



చిన్నారులకు సర్టిఫికెట్ల ప్రదానం

ఇందుకూరుపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యలో భాగంగా మూడేళ్లలోపు చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గుడి మంజుల తెలిపారు. మండలంలోని గంగపట్నం పంచాయతీ పరిధిలోని అంగనవాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యను పూర్తి చేసుకున్న ఐదేళ్లు నిండిన చిన్నారులను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తున్నామని చెప్పారు. అనంతరం ప్రీస్కూల్ విద్యను పూర్తి చేసుకున్న 15 మంది చిన్నారులను సమీపంలోని ఒకటో తరగతిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు స్వరూప, చాముండేశ్వరి, రాజేశ్వరి, విజయ, రమణమ్మ, సుమ, తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి వల్లే డయేరియా



మడపల్లిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

- మడపల్లిలో ప్రత్యేక వైద్యశిబిరం

ఆత్మకూరు(చేజర్ల) : కలుషిత నీటి వల్ల డయేరియా సంక్రమించే అవకాశం ఉందని, కాచి చల్లార్చిన నీటిని తాగడం లేదా పరిశుభ్రమైన నీటిని తాగడం ద్వారా అరికట్టవచ్చని చేజర్ల పీహెచ్‌సీ డాక్టర్ మెహతాజ్ అన్నారు. మండలంలోని మడపల్లిలో సచివాలయం వద్ద బుధవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు డయేరియాపై అవగాహన కల్పించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మొహతాజ్ మాట్లాడుతూ డయేరియా లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రులను సంప్రదించాలన్నారు. వర్షాకాలం రానుండడంతో డయేరియా నివారణతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కె.చంద్రయ్య, ఎంసీహెచ్ఓ పద్మమ్మ, ఏఎన్ఎం మస్తానమ్మ, ఆశా వలంటీర్లు నిర్మల, సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో డయేరియాకు కళ్లెం



రామన్నపాళెంలో గిరిజనులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

కొడవలూరు: పరిశుభ్రత పాటించడం ద్వారా డయేరియాకు కళ్లెం వేయవచ్చని ఐసీడీఎస్ కోవూరు ప్రాజెక్ట్ సీడీపీఓ జ్యోతి సూచించారు. మండలంలోని రామన్నపాళెం గిరిజన కాలనీలో డయేరియా–నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రమైన ఆహార పదార్థాలు, నీటిని తీసుకోవాలని సూచించారు. ఈగలు ముసిరిన, పాచిపోయిన ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో తీసుకోరాదని తెలిపారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని తెలిపారు. దోమ కాటుకు గురవకుండా దోమతెరలను వినియోగించాలని సూచించారు. అనంతరం చేతులను శుభ్రపరచుకోవడంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్త రోజా పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



కొడవలూరు: యల్లాయపాళెం నేను బడికి పోతాపై అవగాహన ర్యాలీ

కొడవలూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, చిన్నారులు బడికి వెళ్లి చదువుకోవాలని యల్లాయపాళెం హైస్కూల్ హెచ్ఎం మోహనరామలింగయ్య సూచించారు. మండలంలోని యల్లాయపాళెం మెయిన్, ఉర్దూ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులతో 'నేను బడికి పోతా'పై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిహేనేళ్లలోపు పిల్లలంతా విధిగా పాఠశాలలోనే ఉండాలన్నారు. ప్రతి చిన్నారి చదువుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే నేను బడికి పోతా కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పైసా ఖర్చులేకుండా ఉన్నత చదువులు చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని వివరించారు. హెచ్ఎంలు వై శ్రీలత, ఎస్కే ఖాజా రసూల్, ఉపాధ్యాయులు నరహరి, నూర్జహాన్‌బేగం, లక్ష్మయ్య పాల్గొన్నారు.

- రామాపురం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాధవి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడి బయట ఉన్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. తద్వారా పిల్లల జీవితాలను మెరుగుపరచవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని సుహాసిని రేచల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాచలం: బడి మానేసిన పిల్లలను తప్పనిసరిగా బడికి పంపి చదివించేలా తల్లిదండ్రులు ఆలోచన చేయాలని ఎంఈఓ–1 మధుసూదన్ అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కురిచెర్లపాడులో బడి మానేసిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడికి వెళ్లాల్సిన పిల్లలను పనులకు పంపితే వారి భవిష్యత్ దెబ్బతింటుందని తెలియజేశారు. చదువు పిల్లలకు సమాజం గురించి పూర్తిగా తెలుసుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 శ్రీనివాసులురెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వెంకటాచలం: బడి మానేసిన బాలికతో మాట్లాడుతున్న ఎంఈఓలు



కొడవలూరు మండలం రామాపురం గిరిజన కాలనీలో..

వైభవంగా పోలేరమ్మ జాతర



పొంగళ్లు పెట్టేందుకు ఆలయానికి వస్తున్న మహిళలు

సోమశిల : అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి గ్రామంలో పోలేరమ్మ జాతర మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. పోలేరమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. పోలేరమ్మ తల్లిని విశేష పూలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంగళవాయిద్యాలు, కర్రసాము విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాతర మహోత్సవానికి హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సమీప గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.